క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

గన్నవరం: స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం పి. శివాజీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గన్నవరం ఆర్టీసీ డిపో నుంచి నడుపుతున్న బస్ సర్వీస్‌లకు సంబంధించి సూచనలు, సలహాలు, సమస్యలను 8790996090కు ఫోన్ చేసి తెలియజేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని డిపో పరిధిలోని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నర్సరీని సందర్శించిన విద్యార్థినులు



పెనమలూరు: పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు పీఎంశ్రీ ఒకేషనల్ ట్రైనింగ్‌లో భాగంగా గురువారం గంగూరులోని నందనవనం నర్సరీని సందర్శించారు. నర్సరీలో పూలు, పండ్ల సాగుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా మొక్కలు పెంచుకుంటూ ఆర్థికంగా బలోపేతం కావాలని ఒకేషనల్ ట్రైనర్ ఎం.సింధు సూచించారు. విద్యార్థులు నర్సరీ నిర్వహణ, మొక్కల పెంపకంపై పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై.దుర్గాభవాని, ఉపాధ్యాయులు డి.వి. సుబ్బారావు, శ్రీలక్ష్మి, టి.విజయలక్ష్మి, సీతా మహాలక్ష్మి, బి.చినబాబు, విద్యార్థినులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి వాటర్ డిస్పెన్సర్ బహూకరణ



గన్నవరం: స్థానిక ప్రథమశ్రేణి గ్రంథాలయంలో పాఠకులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు రోటరీక్లబ్ ఆఫ్ గన్నవరం శాఖ ద్వారా రోటేరియన్ కంభంపాటి సూర్యచంద్రరావు వాటర్ డిస్పెన్సర్‌ను బహూకరించారు. ఈ మేరకు గురువారం వాటర్ డిస్పెన్సర్‌ను రోటరీక్లబ్ అధ్యక్షుడు టీఎస్ఆర్‌కే ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజికాభివృద్ధిలో రోటరీక్లబ్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. వాటర్ డిస్పెన్సర్ అందజేసిన కంభంపాటిని అభినందించారు. గ్రంథాలయ అభివృద్ధికి స్వచ్ఛందంగా ముందుకువస్తున్న దాతలకు కమిటీ అధ్యక్షుడు నర్రా సీతారామారావు కృతజ్ఞతలు తెలిపారు. గ్రంథాలయంలో పుస్తక సంపదను, సదుపాయలను పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రోటేరియన్లు గన్నె వెంకట్రావు, చిమట రామారావు, ఎం. రాధాకృష్ణ, జాస్తి విజయభూషణ్‌కుమార్, గూడవల్లి సురేష్‌బాబు, గ్రంథాలయ ఇన్‌ఛార్జ్ పీడీ లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

చాగంటిపాటి సంస్మరణ సభ

పెనమలూరు: ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటం చేసేది కమ్యూనిస్టులేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సభ్యుడు జెల్లి విల్సన్ అన్నారు. కమ్యూనిస్టు సీనియర్ నాయకుడు చాగంటిపాటి రామచంద్రరావు సంస్మరణ సభ గురువారం పెనమలూరులో నిర్వహించారు. ఈ సభలో పాల్గొన్న విల్సన్ మాట్లాడుతూ చాగంటిపాటి రామచంద్రరావు వెనుకబడిన వర్గాల హక్కుల కోసం అనేక పోరాటాలు చేశారన్నారు. నేడు ఆయన లేని లోటు తీర్చలేది అన్నారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శులు దోనేపూడి శంకర్, టి.తాతయ్య మాట్లాడుతూ పేదల పక్షాన కమ్యూనిస్టులు ఉండి పెరిగిన విద్యుత్ చార్జీలు, ఇళ్ల స్థలాల కోసం పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘ అధ్యక్షుడు వెలగపూడి ఆజాద్, ప్రజా నాట్య మండలి రాష్ట్ర నాయకుడు ఆర్.పిచ్చయ్య, నేతలు మున్నంగా నరసింహారావు, వి.బాలస్వామి, మిక్కిలినేని రాధాకృష్ణ, ఎలమంచలి వెంకటేశ్వరరావు, మోతుకూరి అరుణ్‌కుమార్, గాలంకి వసంతరావు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో గురువారం స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఐదు గంటల నుంచి పలు దఫాలుగా రుద్రాభిషకం చేశారు. అలాగే ఉదయం ఎనిమిది గంటలకు ఏకాదశ రుద్రాభిషేకం జరిగింది. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. త్రయోదశి కారణంగా ఆలయంలో మహానందీశ్వరుడికి అభిషేకం, అర్చన చేశారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ధాన్యం దిగుమతుల్లో జాప్యం

- ఆందోళనలో అన్నదాతలు
- మిల్లుల వద్ద క్యూ కడుతున్న ధాన్యం లోడు వాహనాలు



దావులూరు టోల్‌గేట్ వద్ద నిలిపి ఉంచిన ధాన్యం లోడు వాహనాలు

కంకిపాడు: ధాన్యం సేకరణ వేగవంతం అయ్యిందని సంతోషించే లోపే మిల్లుల వద్ద దిగుమతుల్లో జాప్యం నెలకొంది. ధాన్యం లోడు వాహనాలు మిల్లుల వద్ద బారులు తీరుతున్నాయి. ఓ వైపు దిగుమతిలో జాప్యం అవుతుండటం, మరోవైపు వాతావరణ పరిస్థితులు మారుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట చెమ్మగిల్లి తేమశాతం పెరిగి నాణ్యత దెబ్బతినే అవకాశం ఉందని భయాందోళనలు చెందుతున్నారు.

ముమ్మరంగా వరి కోతలు

మండలంలోని వివిధ గ్రామాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 16 వేల ఎకరాల్లో వరి సాగు జరిగింది. భారీ వర్షాలు, కృష్ణానదికి సంభవించిన వరదలతో పంట నష్టం వాటిల్లగా 6,428 ఎకరాల్లో పంట దెబ్బతింది. ఖరీఫ్ పంట ప్రస్తుతం చేతికొచ్చింది. వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. అయితే ధాన్యం సేకరణ మాత్రం నత్తనడకన సాగడంపై రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. సివిల్ సప్లయిస్ అధికారులు ధాన్యం సేకరణపై దృష్టి సారించి కోత కోసిన ధాన్యం యుద్ధప్రాతిపదికన మిల్లులకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో అవసరమైన గోనె సంచులు, రవాణా వాహనాలను గ్రామాలకు తరలించారు.

లారీల వద్ద రైతుల పడిగాపులు

కోతకోసిన ధాన్యం కాటాలు వేసి సిద్ధంగా ఉన్న బస్తాలను లారీలకు ఎత్తి మిల్లులకు తరలించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. దావులూరు టోల్‌గేట్ వద్ద రవాణా శాఖ అధికారులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించి రవాణా వాహనాలను అవసరం మేరకు గ్రామాలకు తరలించారు. లారీల్లో ధాన్యం బస్తాలను రైతులు మిల్లులకు తరలిస్తున్నారు. దీంతో మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న మిల్లుల వద్ద లారీలు బారులు తీరుతున్నాయి. ఒక్క దావులూరు బాలాజీ మిల్లు వద్దే గురువారం 50కి పైగా లారీలు దిగుమతి కోసం ఎదురుచూస్తున్నాయి. లారీల వద్ద రైతులు పడిగాపులు పడుతున్నారు. పచ్చి మీద ధాన్యం బస్తాలకు ఎత్తడంతో నాణ్యత ఎక్కడ దెబ్బతింటుందోనని భయపడుతున్నారు. దీనికి తోడు వెయిటింగ్‌కు అదనంగా కిరాయి భారం అవుతుందని ఆందోళన చెందుతున్నారు. మిల్లుల వద్ద ధాన్యం లారీలు



కంకిపాడు ఫ్లైఓవర్ వద్ద ధాన్యం రాసులు

పేరుకుపోకుండా, దిగుమతులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, రైతులపై అదనపు కిరాయి భారం, నాణ్యత ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని రైతాంగం కోరుతున్నారు.

సూపర్‌సిక్స్ పథకాలు ఎక్కడ.?

వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త చక్రవర్తి

పెనమలూరు: ఎన్నికల సమయంలో కూటమి నేతలు ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత ఎందుకు అమలు చేయడంలేదని పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి ప్రశ్నించారు. కానూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి నేతలు ఇది మంచి ప్రభుత్వమని చెప్పుకుంటూ పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయని కూటమి ప్రభుత్వం ఎలా మంచి ప్రభుత్వం అవుతుందని ప్రశ్నించారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల మాయమాటలు నమ్మి ప్రజలు పూర్తిగా మోసపోయారని అన్నారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సూపర్ సిక్స్ హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

అక్రమ కేసులు పెట్టడం దారుణం

వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై కూటమి



సమావేశంలో మాట్లాడుతున్న దేవభక్తుని చక్రవర్తి

ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతోందని దేవభక్తుని చక్రవర్తి విమర్శించారు. వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులు చేసి ఎదురుకేసులు పెట్టడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ కక్షసాధింపు చర్యలను సమర్థవంతంగా ఎదుర్కొంటామని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రిటర్న్ గిఫ్ట్ తప్పక ఇస్తామని చక్రవర్తి పేర్కొన్నారు. సోషల్‌మీడియా హక్కులను కూటమి ప్రభుత్వం హరిస్తోందని, ఇది రాజ్యాంగ విరుద్ధమని మండిపడ్డారు. సమావేశంలో టిడ్కో మాజీ డైరెక్టర్ పి.రాఘవరావు, వైఎస్సార్ సీపీ నేతలు చక్క గోపి, మండూరు కోటేశ్వరరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

గన్నవరం: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ కే విజయలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని దావాజీగూడెం బాలికల వసతి గృహంలో గురువారం మండల లీగల్ సర్వీస్ అథారిటీ, వాసవ్య మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో బాల్య వివాహాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్జి మాట్లాడుతూ.. చిన్న వయస్సులోనే ఆడపిల్లలకు వివాహాలు చేయడం వల్ల అనారోగ్య సమస్యలతో పాటు గృహ హింసను ఎదుర్కొంటున్నారని చెప్పారు. చట్ట ప్రకారం ఆడ పిల్లలకు 18, మగ పిల్లలకు 21 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలని సూచించారు. బాల్య వివాహాలు చేసిన, ప్రోత్సహించిన వారిని కఠి



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న జడ్జీలు

నంగా శిక్షించడం జరుగుతుందన్నారు. అనంతరం వాసవ్య మహిళా మండలి సోషల్ వర్కర్ డి. మార్తమ్మ నేతృత్వంలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి బీ శిరీష, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీఎస్ఆర్ మూర్తి, కార్యదర్శి ఆర్ ప్రకాశరావు, న్యాయవాది వెంకట్, పలువురు వార్డెన్లు, పారా లీగల్ వలంటీర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక న్యాయానికి పూలే కృషి



జ్యోతిరావుపూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దేవభక్తుని చక్రవర్తి

పెనమలూరు: సామాజిక న్యాయం, మహిళా అభ్యున్నతికి పోరాడిన మహోన్నత వ్యక్తి జ్యోతిరావుపూలే అని పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి అన్నారు. కానూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం మహాత్మ జ్యోతిరావుపూలే వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం చక్రవర్తి మాట్లాడుతూ నేడు మహిళలు అన్నిరంగాల్లో ముందుకు రావడం జ్యోతిరావుపూలే చేసిన కృషేనని తెలిపారు. నేటి యువత పూలే ఆశయాలను ఆదర్శంగా తీసుకుని పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పి.రాఘవరావు, మండూరు కోటేశ్వరరావు, ఫజల్‌హక్, చక్క గోపి, అబ్దుల్‌వాహెబ్, రబ్బాని, చాన్‌బాషా, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు: మహాత్మా జ్యోతిరావుపూలే వర్ధంతిని కంకిపాడులో గురువారం నిర్వహించారు.



కంకిపాడులో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

ట్రావెలర్సు బంగ్లా వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పూలే చిత్రపటానికి ప్రజాసంఘాల నేతలు నివాళులర్పించారు. మదర్‌థెరిస్సా సేవా సంఘం ప్రతినిధి తాడితోటి నరసింహారావు మాట్లాడుతూ పూలే నేటి తరానికి ఆదర్శ ప్రాయమన్నారు. పచ్చిపాల కనకదుర్గారావు, సిరివెళ్ల చిట్టిబాబు, ఎంఎస్ రాజు, జల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

1న బ్రాహ్మణ పరిషత్ కార్తిక వన సమారాధన

గన్నవరం: స్థానిక శ్రీఆంజనేయస్వామి దేవస్థానం సమీపంలోని సపోటతోటలో వచ్చేనెల ఒకటవ తేదీన బ్రాహ్మణ పరిషత్ గన్నవరం శాఖ ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన నిర్వహించనున్నట్లు ఆ సంఘ అధ్యక్షుడు పన్యారం విష్ణుమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటలకు గోపూజతో వన సమారాధన ప్రారంభమవుతుందన్నారు. అనంతరం ఉసిరిక పూజ, మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, ఆగిరిపల్లి వేద విద్యార్థులచే వేద పారాయణం, వనభోజనాలు, నృత్య ప్రదర్శనలు జరుగుతాయని తెలిపారు. బ్రాహ్మణ పరిషత్ సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.

సాంకేతిక పరిజ్ఞాన్ని సద్వినియోగించుకోవాలి



ఉంగుటూరు: సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని దాత ఎన్ఆర్ఐ బొబ్బా వెంకటాద్రి అన్నారు. ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్ నూతన భవన నిర్మాణానికి, అభివృద్ధికి రూ. కోటి విరాళం అందించిన దాత, ఎన్ఆర్ఐ, పాఠశాల పూర్వ విద్యార్థి బొబ్బా వెంకటాద్రి గురువారం పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడారు. దాతల తోడ్పాటును సద్వినియోగించుకొని సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత పెంపొందించుకోవాలన్నారు. రోటరీ క్లబ్ ప్రపంచంలో 200 దేశాల్లో ప్రతి ఏటా నాలుగు వేల కోట్లతో విద్య, వైద్య సేవలతో పాటుగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు వివరించారు. విద్యార్థులు బాగా చదివి దేశానికి, తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు ప్రతిష్టలు సంపాదించి పెట్టాలని సూచించారు. ఉపాధ్యాయులు సాంకేతిక పరిజ్ఞానంతో విద్యాభ్యాసం చేస్తూ నాణ్యమైన విద్యనందించి, మంచి ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎస్ఆర్‌టీఎస్ డెప్యూటీ డైరెక్టర్ బి.విజయకుమారి, ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ అనిత, పాఠశాల నిర్వాహణ కమిటీ చైర్మన్ పులి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహన లోపం.. అవస్థలు తథ్యం



కానూరు ప్రధాన రహదారి

- డ్రెయినేజీ నిర్మాణంపై అభ్యంతరాలు
- మాస్టర్‌ప్లాన్ ప్రకారం నిర్మించాలని డిమాండ్

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో చేపడుతున్న అభివృద్ధి పనులపై నాయకులు, అధికారులకు చిత్తశుద్ధి కనబడటం లేదు. కానూరు గ్రామ ప్రధాన రహదారి వెంట డ్రెయినేజీల నిర్మాణం చేయాలని ఇటీవల పాలకులు శంకుస్థాపన చేశారు. అయితే డ్రెయినేజీల నిర్మాణంపై అవగాహన లోపంతో పాలకులు ఉండటంతో గ్రామస్తుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. కానూరులో దాదాపు 60 వేల మంది జనాభా ఉన్నారు. గ్రామస్తుల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటుంది. బందరు రోడ్డు నుంచి కానూరులోకి ఉన్న ప్రధాన రహదారి అధ్వానంగా ఉండటమే కాకుండా రోడ్డుకు ఇరువైపులా పక్కా డ్రెయినేజీలు లేకపోవడంతో వర్షం చినుకు పడితే చాలు రోడ్డు జలమయమవుతుంది. గత వర్షాకాలంలో కురిసిన వర్షాల కారణంగా డ్రెయినేజీలు లేకపోవడంతో రహదారితో పాటు పలు కాలనీలు జలమయమయ్యాయి. దీంతో డ్రెయినేజీల నిర్మాణం అత్యవరమయింది.

మాస్టర్‌ప్లాన్ ప్రకారం డ్రెయినేజీలు నిర్మించాలి

కానూరు ప్రధాన రహదారి వెడల్పు ప్రస్తుతం 40 అడుగుల మేర ఉంది. డ్రెయినేజీకి రూ. 1.90 కోట్ల నిధులు తాడిగడప మున్సిపాలిటీ కేటాయించడంతో నిర్మాణ పనులకు మార్కింగ్ మొదలుపెట్టారు. అయితే అధికారులు ఎఫ్ఎంబీ ప్రకారం ఉన్న రోడ్డు 40 అడుగులకే డ్రెయినేజీ నిర్మాణానికి మార్కింగ్ చేయడంతో గ్రామంలో అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. మాస్టర్‌ప్లాన్ ప్రకారం రోడ్డు 60 అడుగులకు విస్తరించాల్సి ఉంది. ఆ తర్వాతే డ్రెయినేజీ నిర్మాణం చేయాలి. చాలా ప్రాంతాల్లో 60 అడుగుల మేర రోడ్డు ఉంది. కొన్ని ప్రాంతాల్లో మాత్రమే ఇళ్లు అడ్డుగా ఉన్నాయి. వారికి బాండ్లు ఇచ్చి రోడ్డు 60 అడుగులు చేసి డ్రెయినేజీలు నిర్మాణం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఒకసారి డ్రెయినేజీల నిర్మాణం చేసిన తర్వాత రహదారి విస్తరణ చేయడం ఆచరణలో సాధ్యం కానందున సరైన నిర్ణయం ఇప్పుడే తీసుకోవాలనేది స్థానికుల సూచన.

కమిషనర్‌ను కలిసిన అన్నే

కానూరు మాజీ సర్పంచి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి గురువారం తాడిగడప కమిషనర్ భవానీప్రసాద్‌ను కలిశారు. కానూరు రోడ్డు మాస్టర్‌ప్లాన్ ప్రకారం 60 అడుగులు ఉన్నందున డ్రెయిన్లు 60 అడుగుల తర్వాతే నిర్మించాలని కోరారు. దీని వల్ల ట్రాఫిక్ సమస్యలు తీరుతాయని, భవిష్యత్తు ప్రణాళికలకు అనువుగా ఉంటుందని కమిషనర్ దృష్టికి అన్నే తీసుకువచ్చారు. రోడ్డు విస్తరణకు అనువుగా లేకుండా డ్రెయినేజీలు నిర్మాణం చేస్తే అడ్డుకుంటామని తెలిపారు.

ఆలోచించే నిర్ణయం

కానూరు రోడ్డు విస్తరించి డ్రెయినేజీ నిర్మాణంపై ఆలోచించి నిర్ణయం తీసుకుంటాం. ఇప్పటికే ఇంజినీరింగ్ విభాగం అధికారులు కసరత్తు చేపట్టారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకునే పనులు చేస్తాం.

– భవానీప్రసాద్, తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్

దాడి కేసులో నిందితులకు రెండు రోజుల కస్టడీ

గన్నవరం: పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కాసరనేని రంగబాబుపై దాడి కేసులో అరెస్ట్ అయ్యి రిమాండ్‌లో ఉన్న ఎనిమిది మందిని రెండు రోజుల పాటు పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ గన్నవరం కోర్టు గురువారం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఏడాది జనవరి 20వ తేదీన విమానాశ్రయం పక్కనే ఉన్న హోటల్ వద్ద రంగబాబుపై దాడి జరిగింది. ఈ దాడికి పాల్పడిన ఎనిమిది మంది వ్యక్తులను అప్పట్లోనే పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కేసు పునఃవిచారణ పేరుతో గుర్రం అంజయ్య(నాని), కర్నాటి నిరంజన్, ఓలుపల్లి మోహన్‌రంగా, మేదినేని బాబు, అనగాని రవి, గోనూరు సీమయ్య, భీమవరపు యతేంద్రరామకృష్ణ(రాము), సూరపనేని అనిల్‌కుమార్‌ను నిందితుల జాబితాలో చేర్చారు. వీరిని ఈ నెల 19న అరెస్ట్ చేసి కోర్టు ఆదేశాలతో నెల్లూరు సెంట్రల్ జైలుకు రిమాండ్ నిమిత్తం తరలించారు. అయితే అదనపు విచారణ కోసం నిందితులను కస్టడీకి కోరుతూ స్థానిక 8వ అడిషనల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై వాదనల అనంతరం రెండు రోజుల పాటు పోలీసుల కస్టడీకి అప్పగించేందుకు కోర్టు అనుమతించింది. అయితే పోలీసులు కస్టడీ విచారణ ఎక్కడ చేస్తారనేది ఇంకా స్పష్టత రాలేదు.



కోలవెన్ను సొసైటీ వద్ద ధాన్యం బస్తాలపై కప్పిన పరదాలు



కంకిపాడులో రోడ్డుపై ధాన్యం దిగుమతి చేస్తున్న ట్రాక్టరు

అన్నదాతల్లో తుపాను భయం

కంకిపాడు: తుపాను భయం రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. వాతావరణం గురువారం పూర్తిగా మబ్బులు కమ్మి, తీవ్రమైన చలిగాలులు వీస్తున్నాయి. కోత కోసి రోడ్లు, కల్లాల్లోకి చేర్చిన ధాన్యం కాటాలు వేసి మిల్లులకు తరలించేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఎక్కడ చూసినా ధాన్యం నిల్వలే కనిపిస్తున్నాయి. కోతలు వేగం చేసి పంటను కాపాడుకోవాలని రైతులు తాపత్రయ పడుతున్నారు. వర్షం, గాలులకు చేలు పడిపోతే పండించిన పంట చేతికి అందే పరిస్థితి లేదని రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ధాన్యం లోడు చేస్తున్న కూలీలు



కంకిపాడు బైపాస్‌లో ధాన్యం కాటా పనులు చేస్తున్న కూలీలు



కోలవెన్నులో ధాన్యం రాసులు

రూ. 4 కోట్ల భూమిపై వివాదం

ఒక వర్గంపై మరో వర్గం దాడి

పెనమలూరు: యనమలకుదురులో రూ. నాలుగు కోట్లు విలువ చేసే భూమిపై ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. యనమలకుదురు కరకట్ట దిగువున రూ. నాలుగు కోట్లు విలువ చేసే 80 సెంట్ల స్థలం ఉంది. ఆ స్థలం యజమాని గతంలో ఒక వ్యాపారికి తనఖా పెట్టారు. అయితే అదే స్థలాన్ని యనమలకుదురుకు చెందిన ఓ టీడీపీ నాయకుడు తనఖా పెట్టించుకున్న వ్యక్తి నుంచి కొనుగోలు చేశాడు. దీంతో తనఖా పెట్టిన వ్యక్తి తన స్థలం ఎలా అమ్ముతారని అభ్యంతరం తెలుపుతూ తన అనుచరులతో బుధవారం రాత్రి స్థలంలో బైఠాయించారు. దీంతో టీడీపీ నాయకుడు పెద్ద ఎత్తున అనుచరులను తీసుకువచ్చి స్థలంలో ఉన్న వ్యక్తులపై దాడి చేసి స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు ఈ ఘటనలో జోక్యం చేసుకోకుండా ఉండాలని పశ్చిమ కృష్ణాకు చెందిన టీడీపీ ఎమ్మెల్యే రంగంలోకి దిగాడు. దీంతో పోలీసులు మౌనం వహించారని గుసగుసలు వినబడుతున్నాయి. అయితే తనఖా పెట్టిన వ్యక్తికి మద్దతుగా విజయవాడకు చెందిన జనసేన నేత ఉండటం విశేషం. దీంతో టీడీపీ, జనసేన నేతలకు మధ్య చిచ్చు రాజుకుంది. యనమలకుదురులో పెద్ద ఎత్తున ఘర్షణ జరిగినా పోలీసులు మౌనంగా ఉండటంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

ఘనంగా లక్షబిల్వార్చన

హనుమాన్‌జంక్షన్ రూరల్: కార్తికమాసాన్ని పురస్కరించుకుని బాపులపాడు మండలం వీరవల్లిలోని శివాలయంలో గురువారం విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గ్రామంలోని గంగా, పార్వతీ సమేత కొండేశ్వరస్వామి దేవస్థానంలో లక్ష బిల్వ పత్రాలతో పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు.